ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
30 ఏప్రిల్
2025






## తెలంగాణ విద్యా చైతన్య వేదిక గౌరవాధ్యక్షులుగా మాజీ ఎం. పి. డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

కరీంనగర్, రోమింగ్ న్యూస్, : కరీంనగర్ నగరంలోని మంకమ్మ తోటలో విజ్ఞాన్ సెమినార్ హాల్లో తెలంగాణ విద్యా చైతన్య వేదిక రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశం జరిగినది . ఈ సమావేశంలో తెలంగాణ విద్యా చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారిని ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆసంఘ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారు డాక్టర్ గా వైద్య సేవలు అందించడమే కాక సామాజిక సేవలలో ఎప్పుడూ ముందుంటారని వారి స్ఫూర్తితో ఇంకా సంఘం యొక్క సేవలను పెంచుతూ అధిక సభ్యత్వ నమోదుకు కృషి చేస్తామన్నారు ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం మాట్లాడుతూ సమాజానికి విద్యా, వైద్య, న్యాయ సహాయాలను అందించడంలో సంఘం ముందుంటుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అరుకూటి మల్లేశం, ఎం జనార్ధన్, జాన్వలి, వి సతీష్, శ్రీలత, శ్రీనివాసరావు, ఎన్ సంపత్ దామోదర్, పవన్ కుమార్, సంధ్య, స్వర్ణలత, స్వాతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ మరియు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు

- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. తుర్కపల్లి మండలం పెద్దతండా గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. కొనుగోలు సెంటర్ ప్రారంభమైనా వడ్ల కొనుగోళ్లు చేపట్టకపోవడంతో పీఏసీఎస్ సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను స్పాట్ నుండే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే హమాలీలను తీసుకుని మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కాంటా అయిన వెంటనే లారీలలో వడ్లను మిల్లులకు తరలించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాజ్యాంగేతర పాలన కోసం మోదీ పన్నాగాలు

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: దేశంలో రాజ్యాంగేతర పాలన సాగించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పన్నాగాలు పన్నుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర తీవ్ర ఆరోపణలు చేశారు. యాదగిరిగుట్టలోని లక్కీ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా రెండవ మహాసభల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాసభల సమావేశంలో వారు మాట్లాడుతూ.. విభజన రాజకీయాలతో మోదీ దేశంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటూ దేశసంపదను దోచిపెడుతున్నారన్నారు. ప్రధానిగా నరేంద్రమోదీ ఇప్పటివరకు 279 ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేశారని, రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి దేశాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు రాజీవ్ యువ వికాస్ పథకం కింద యువతకు ప్రయారిటీ ఇచ్చి అర్హులైన వారికి యూనిట్లు అందివ్వాలని సూచించారు. దేశ భవిష్యత్తు మొత్తం యువతపై ఆధారపడి ఉందని, యువతను విస్మరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరో పోరాటానికి ఏఐవైఎఫ్ సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు. దేశంలో అమాయక ప్రజలపై ఉగ్రదాడులను కేంద్రం అరికట్టాలని, దాడులు పునరావృతం కాకుండా ప్రతిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ సమగ్రత, సమైక్యతను పరిరక్షించడానికి ఏఐవైఎఫ్ సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి అమరవీరుల వారసత్వాన్ని పునికిపుచ్చుకుని.. యువతలో ప్రగతిశీల అభ్యుదయ దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలు రేకెత్తించడానికి ఏఐవైఎఫ్ నిరంతర కృషి చేస్తుందని పేర్కొన్నారు. అంతకుముందు వైకుంఠ ద్వారం నుండి మహాసభల ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి మహేందర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు చెక్క వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు పేరబోయిన పెంటయ్య ఉన్నారు.

# ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో భారీ పేలుడు

**ముగ్గురు మృతి, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు**

**ఏడు కిలోమీటర్ల మేర వైబ్రేషన్‌తో**

**కూడిన సౌండ్, ఉలిక్కి పడ్డ జనం**

**మోటకొండూర్ మండలం కాటేపల్లిలోని**

**'ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్' కంపెనీలో ఘటన**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామ శివారులో ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ముగ్గురు చనిపోగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మోటకొండూర్ మండలం కాటేపల్లిలో ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. కంపెనీలోని బిల్డింగ్-18(ఏ) బ్లాకులో ఎనిమిది మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో బిల్డింగ్ లో ప్రోక్లెంట్ మిక్సింగ్ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు భారీ పేలుడు సంభవించింది. పేలుడు దాటికి బిల్డింగ్ మొత్తం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో కాటేపల్లికి చెందిన గునుకుంట్ల సందీప్(30), మోటకొండూర్ కు చెందిన దేవీచరణ్(20) బిల్డింగ్ శిథిలాల కింద చిక్కుకుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే చనిపోగా.. ఆత్మకూరుకు చెందిన కలువల నరేష్(30) హైదరాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ చనిపోయాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో.. హైదరాబాద్ లోని యశోద, కస్తూరి హాస్పిటళ్లకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. నలుగురు క్షతగాత్రులు వలిగొండ మండలం పులిగిల్లకు చెందిన బుగ్గ లింగస్వామి, మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన శ్రీకాంత్, యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన శ్రీకాంత్, పెద్దకందుకూరుకు చెందిన మహేందర్, మరో కార్మికుడు మహేష్ గా గుర్తించారు. కాగా బిల్డింగ్ శిథిలాల కింద ఉన్న సందీప్, దేవీచరణ్ మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. పేలుడు ధాటికి దాదాపుగా ఏడు కిలోమీటర్ల మేర వైబ్రేట్ అయి భారీ సౌండ్ వ్యాపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. భయంతో ఇండ్ల నుండి బయటకు పరుగులు తీశారు. ప్రొడక్షన్ బిల్డింగ్-18(ఏ)లో ప్రోక్లెంట్ మిక్సింగ్ పనులు జరుగుతుండగా..





ప్రమాదవశాత్తు మిక్సింగ్ బౌల్ లో పేలుడు సంభవించిందని కంపెనీ యాజమాన్యం ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పేలుడు సమయంలో వ్యాపించిన మంటలకు క్షతగాత్రుల శరీరాలు కాలిపోయి తీవ్రంగా గాయపడ్డారు. కాగా జనవరి 4న యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన పేలుడు మరువకముందే అదే కంపెనీకి చెందిన కాటేపల్లి ప్లాంట్ లో పేలుడు జరగడం ఆందోళన కలిగిస్తోంది. పెద్దకందుకూరులో ఉన్న కంపెనీలో ఇప్పటివరకు మూడు ప్రమాదాలు సంభవించగా.. నలుగురు చనిపోయారు. కాటేపల్లిలో ఏర్పాటు చేసిన కంపెనీ ప్లాంట్ లో ప్రమాదం సంభవించడం ఇదే మొదటిసారి కాగా.. ముగ్గురు చనిపోయారు. మరో ఆరుగురికి తీవ్రంగా గాయాలు అయ్యాయి.

**కాటేపల్లి కంపెనీ ఎదుట గ్రామస్తుల ఆందోళన**

కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు సంభవించిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు.. కంపెనీ వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల సేఫ్టీకి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదంలో ముగ్గురు చనిపోయి, పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయని మండిపడ్డారు. బాధితుల కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు సంభవించిన ప్లేస్ ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరిశీలించారు. పేలుడు జరిగిన బిల్డింగ్ ను దూరం నుండి పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. పేలుడులో ముగ్గురు చనిపోగా.. గాయపడి హాస్పిటళ్లలో ట్రీట్‌మెంట్ పొందుతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేలుడు ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం, పలువురికి తీవ్ర గాయాలు కావడం కలిచివేసిందన్నారు. కార్మికుల సేఫ్టీ పట్ల నిర్లక్ష్యం వహించిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఇలాంటి ప్రమాదాలు మళ్ళీ జరగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




# హుండీలతో గుట్ట నరసింహుని రూ.2.41 కోట్ల ఆదాయం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కింపు చేపట్టారు. గత 34 రోజులుగా హుండీలలో భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండిని లెక్కించారు. ఎస్పీఎఫ్, హోంగార్డుల భద్రత నడుమ హుండీలను కొండ కింద సత్యనారాయణస్వామి వ్రత మండపంలోని ప్రత్యేక హాల్ కు తరలించి, హుండీలలోని కానుకలను కౌంట్ చేశారు. ఆలయ ఈవో భాస్కర్ రావు పర్యవేక్షణలో హుండీ కౌంటింగ్ నిర్వహించారు. హుండీలలో భక్తులు సమర్పించిన కానుకల్లో రూ.2,41,35,238 నగదు రాగా.. 143 గ్రాముల బంగారం, 4 కిలోల 250 గ్రాముల వెండి సమకూరిందని ఈవో భాస్కర్ రావు చెప్పారు. ఇక హుండీలలో విదేశీ కరెన్సీని కూడా భక్తులు అధిక మొత్తంలో సమర్పించారు. అమెరికా 702 డాలర్లు, ఇంగ్లాండ్ 70 పౌండ్లు, నేపాల్ 140 రూపీస్, సౌదీ అరేబియా 435 రియాల్స్, సింగపూర్ 09 డాలర్లు, ఆస్ట్రేలియా 210 డాలర్లు, ఖతార్ 2.25 రియాల్స్, థాయ్‌లాండ్ 40 భాట్, ఒమన్ 1/2 రియాల్ 100 బైసా, శ్రీలంక 1000 రూపీస్, మలేషియా 31 రింగిట్స్, యూరో 10 యూరస్, టాంజానియా 20000, అరబ్ ఎమిరేట్స్ 245, నార్వే 100 కరెన్సీ వచ్చినట్లు ఆలయ ఈవో భాస్కర్ రావు వెల్లడించారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. భక్తులు జరిపిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా మంగళవారం ఆలయానికి రూ.24,39,016 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**నారసింహుడి సేవలో నటుడు రాజేంద్రప్రసాద్**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ప్రముఖ సినీనటుడు రాజేంద్రప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా..



ఆలయ అధికారులు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భగుడిలో స్వయంభూ నరసింహస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించానని పేర్కొన్నారు.

